## 16 నుంచి పటాన్‌చెరులో రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు

**పటాన్ చెరు, అక్టోబరు 13, ప్రభాతవార్త :** రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు వేదికగా పటాన్‌చెరు నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానం వేదికగా ఈనెల 16 నుండి 18 తేదీ వరకు జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్, కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీల ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా టీం అండర్ 14, అండర్ 17 కబడ్డీ బాలుర బాలికల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పటాన్ చెరు నియోజకవర్గ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలకు ఆతిథ్యం అందిస్తున్నామన్నారు. 40 లక్షల రూపాయలు సొంత నిధులతో క్రీడోత్సవాల నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులతో పాటు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఎస్జిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, గౌసుద్దిన్, ఎల్లయ్య, ప్రమోద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## బిఆర్ఎస్ టేక్మాల్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప దంపతులపై యువకుల దాడి

**జోగిపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

వాహనానికి అడ్డుపడటంతో, సరిగ్గా నడపమని అన్న పాపానికి భార్యాభర్తల్దిరిపై యువకులు దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని అల్మాయిపేట వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బిఆర్ఎస్ టేక్మాల్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప భార్య లక్ష్మీతో కలిసి టేక్మాల్ వస్తుండగా, మార్గమధ్యలో అల్మాయిపేట వద్ద అందోలుకు చెందిన యువకులు వీరి వాహనానికి వారి బండిని తగిలించారు. దీంతో ఆయన కారు ఆపి, యువకులకు సరిగ్గా బండినడపండి అంటూ యువకులను హెచ్చరించిన క్రమంలో ఆవేశానికి లోనైన యువకులు అందోలుకు చెందిన షాహెద్, జాఫర్‌లు భక్తుల వీరప్ప, ఆయన సతీమణి లక్ష్మీపై ఇష్టమొచ్చినట్లు దాడిచేశారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు వారు జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు జోగిపేట ఎస్ఐ పాండు తెలిపారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'ప్రజావాణి'

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 13, ప్రభాతవార్త :** ప్రజల అర్జీలు, వినతులు, సమస్యలు నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కల్పించే కార్యక్రమమే "ప్రజావాణి" అని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం ప్రజావాణిలో 58 వినతులు స్వీకరించారు. భూ సమస్యలపై 24, పెన్షన్ కోసం 10, ఇందిరమ్మ ఇళ్లకు 6, ఇతర సమస్యలపై 18, మొత్తం 58 వినతులు వచ్చాయన్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ప్రజలు తమ అర్జీలు సమర్పించడం, ప్రజా సమస్యలకు తక్షణ స్పందన, వేగవంతమైన పరిష్కారం అందించడం ఈ వేదిక ప్రధాన లక్ష్యం అని జిల్లా కలెక్టర్ అన్నారు. అధికారులు ప్రజావాణి ద్వారా అందిన ప్రతి అర్జీపై సమగ్ర పరిశీలన చేసి, తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజల అభ్యర్థనలను గౌరవిస్తూ, పారదర్శకతతో, సమయపాలనతో సేవలందించాలని సూచించారు. ప్రజావాణి వేదిక ద్వారా ఇప్పటివరకు చాలా సమస్యలు పరిష్కారమయ్యాయనీ, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సమన్వయాన్ని బలపరచడంలో ఈ కార్యక్రమం ముఖ్యపాత్ర పోషిస్తోందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాస్ రావు, ట్రైనీ ఆర్ డి ఓ.మెహమ్మద్ అహ్మద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అందని వైద్యసేవలు

### ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు



ప్రజావాణిలో ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న కమ్మరి శ్రీను

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 13 (ప్రభాతవార్త):** గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలు అత్యంత దయనీయంగా మారాయని, రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని టెలికాం బోర్డు మెంబర్ కమ్మరి శ్రీను ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్‌లో ప్రభుత్వాసుపత్రి వైద్యులు బాధ్యతను విస్మరించి రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు పంపిస్తూ కమీషన్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఆసుపత్రి పరిసరాల్లో కొంతమంది ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు తిరుగుతూ రోగులకు మాయమాటలు చెప్పి ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకెళ్తున్నారని స్థానికులు చెబుతున్నారని, ఇది వైద్య సేవల పట్ల ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేద ప్రజల ఆసుపత్రి, కానీ ప్రస్తుతం అది నిర్లక్ష్యం, అవినీతి, దౌర్జన్యం యొక్క కేంద్రంగా మారిందన్నారు. వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రభుత్వాసుపత్రి వద్ద తిరుగుతున్న ప్రైవేట్ ఆసుపత్రుల ఏజెంట్లపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని తక్షణమే తొలగించాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి డిఎంహెచ్ఓకు సమగ్ర విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్, మచ్చ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రవీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబరు 13, ప్రభాతవార్త:** ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 38 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రతి అర్జీపై తక్షణ చర్యలు తీసుకుని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. అలాగే ప్రజల ప్రధాన సమస్యలపై పూర్తి దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డుపై బ్రిడ్జి నిర్మించాలని ప్రజావాణిలో వినతి...

**హత్నూర అక్టోబర్ 13, ప్రభాతవార్త:** హత్నూర మండలం బోరుపట్ల గ్రామం నుంచి రెడ్డి ఖానాపూర్ వెళ్లే రోడ్డుపై ఉన్న బ్రిడ్జి కూలిపోయే స్థితికి చేరుకుందని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సంగారెడ్డిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేసినట్లు బోర్పట్ల గ్రామానికి చెందిన మాల మానాడు సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగోల్పల్లి ఆంజనేయులు తెలిపారు.

# బిఆర్ఎస్‌లో అంతర్గత కుమ్ములాటలు!

*** బాకీ కార్డుతో మరోసారి బయటపడిన విభేదాలు * స్థానిక ఎన్నికల వేళ మరింత ముదురుతున్న వైనం**

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 13, ప్రభాతవార్త :** పార్టీలో ఏకచక్రాధిపత్యం..తాను చెప్పిందే ఫైనల్.. అన్న వ్యవహారశైలితో గత ఎన్నికల్లో జిల్లా బిఆర్ఎస్ పార్టీ భారీమూల్యం చెల్లించుకోవలసి వచ్చింది... అంతిమంగా మెదక్ నియోజకవర్గంలో ఆ పార్టీ అధికారాన్ని కోల్పోయింది. కానీ... ఇప్పటికీ పార్టీలో ఎలాంటి మార్పు లేదు. అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టాల్సిన సమయంలోనూ ఆ పార్టీ నేతలు కలిసి నడవడంలేదు. ముఖ్య నేతల ఆధిపత్య పోరుతో పార్టీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంతారెడ్డి తిరుపతిరెడ్డికి మధ్య ఇప్పటివరకు అంతర్గతంగా కొనసాగుతున్న విభేదాలు.. నిజాంపేట మండలంలో పార్టీ కార్యకర్తల అలయ్ బలయ్ కార్యక్రమంలో బహిర్గతమయ్యాయి. కంతారెడ్డి తిరుపతిరెడ్డి "నేనే ఎమ్మెల్యే... రాసి పెట్టుకోండి" అంటూ చేసిన వ్యాఖ్యలు అటు జిల్లాలో ఇటు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.




**నేనే ఎమ్మెల్యే వ్యాఖ్యలతో బిఆర్ఎస్‌లో చర్చ....**

వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యే నేనే... నాకు కేటీఆర్, హరీష్‌రావుల మద్దతు ఉంది.... రాసిపెట్టుకోండి... అంటూ నియోజకవర్గం ఇన్‌చార్జి కంతారెడ్డి తిరుపతిరెడ్డి చేసిన వ్యాఖ్యలు బిఆర్ఎస్ పార్టీలో కలకలం రేపింది. పార్టీ నాయకులు, కార్యకర్తల్లో కొత్త చర్చకు దారితీసింది. అసలే పార్టీ అధికారంలో లేక ఇబ్బందులు పడుతున్న తమకు దిశా-నిర్దేశం చేయాల్సిన నేతలు ఆధిపత్య పోరుతో కార్యకర్తల్లో గందరగోళం సృష్టించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డ తిరుపతిరెడ్డి ఎన్నికల సమయంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఆయన పార్టీకి రాజీనామా చేసి, ఎన్నికల్లో పద్మాదేవేందర్‌రెడ్డి పక్షాన ప్రచారం చేశారు. ఎన్నికల సమయంలో పార్టీ ఇచ్చిన హామీలతోనే బీఆర్ఎస్‌లో చేరిన ఆయన ముందు నుంచి గుర్తింపు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మకు, ఆయనకు మధ్య విభేదాలు చోటు చేసుకుంటున్నాయి. అయితే అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టే క్రమంలో అధిష్టానం పిలుపు ఇచ్చిన కార్యక్రమాల్లో ఆయనకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని, అందులో భాగంగానే ఇటీవల జరిగిన కాంగ్రెస్ బాకీ కార్డు విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొనలేదని తెలుస్తోంది. కానీ ఆయన తన వర్గం నేతలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఇద్దరు నేతల మధ్య విభేదాలు మరింతగా పెరిగాయి.

**పద్మకు ఇప్పటికీ తప్పని ఇంటి పోరు...**

బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మకు ఇప్పటికీ సొంత పార్టీ నేతలతో ఇంటిపోరు తప్పడంలేదని పార్టీ శ్రేణులు అంటున్నాయి. గతంలో పార్టీ అధికారంలో ఉన్నా... తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ కేసీఆర్ రాజకీయ కార్యదర్శి, అప్పటి ఎమ్మెల్సీ శేరీ సుభాష్‌రెడ్డితో విభేదాల కారణంగా అంతర్గత విభేదాలు తలెత్తాయి. అంతేకాకుండా అప్పటివరకు తనకు అండగా నిలిచిన కొందరు నేతలు ఎన్నికల సమయంలో పార్టీని వీడి వెళ్లిపోయారు. ఇలా ముందునుంచి పార్టీలో వర్గాలు, ఆధిపత్య పోరు, ఏక చక్రాధిపత్యంగా వ్యవహరించడంమూలంగానే ఆమె గత ఎన్నికల్లో ఓటమి పాలైంది అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు జిల్లా పార్టీ అధ్యక్షురాలిగా ఉన్న ఆమె పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సింది పోయి పార్టీలో విభేదాలకు కారణంగా మారుతున్నారు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక ఎన్నికల సమయంలో పార్టీలో అంతర్గత విభేదాలు మరింత తీవ్రమయితే, స్థానిక ఎన్నికల్లోనూ భారీమూల్యం చెల్లించక తప్పదని పార్టీశ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా బిఆర్ఎస్ పార్టీలో అంతర్గతంగా పెరుగుతున్న విభేదాలపై పార్టీ జోక్యం చేసుకుంటుందా....? లేదా....? అనేది చూడాలి....!!!!

# బాలుడి మృతి పోలియో చుక్కల మందు వల్ల కాదు

### జిల్లా వైద్యాధికారి నాగ నిర్మల కంగ్టి సంఘటనపై స్పందించిన కలెక్టర్

**కంగ్టి, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** కంగ్టి మండలం భీమ్రా గ్రామంలో మృతి చెందిన మూడు నెలల బాలుడు పోలియో చుక్కలవల్ల కాదని జిల్లా వైద్యాధికారి నాగనిర్మల తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా వైద్య అధికారి ఈ సంఘటనపై వెంటనే స్పందించారు. జిల్లా వైద్యఅధికారి అందించిన వివరాలు, వైద్యఅధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్‌సి) కంగ్టి అందించిన వివరాల ప్రకారం స్వర్ణలత మగ శిశువు (వయసు 3 నెలలు), భీమ్రా గ్రామం, కంగ్టి మండలం నివాసి ఈ శిశువును తల్లిదండ్రులు ఈ నెల 12 న మధ్యాహ్నం 12 గంటల సమయంలో గ్రామంలోని పల్స్ పోలియో బూత్‌కు తీసుకువచ్చారు. బూత్‌లో శిశువుకు పల్స్ పోలియో చుక్కలు ఇవ్వడం జరిగింది. అనంతరం 12:30 గంటల వరకు పర్యవేక్షణలో ఉంచారు. ఈ సమయంలో శిశువు సాధారణంగానే ఉన్నాడు. ఎలాంటి ఇబ్బందులు కనిపించలేదు. అనంతరం తల్లిదండ్రులు శిశువును ఇంటికి తీసుకెళ్లారు. మధ్యాహ్నం సుమారు 1:00 గంటల సమయంలో, శిశువు నిరంతరంగా ఏడుస్తున్నాడని, ఒకసారి వాంతి అయిందని తల్లిదండ్రులు బూత్‌కు తిరిగి తీసుకువచ్చారు. తల్లి తెలిపిన ప్రకారం, ఇంటికి చేరుకున్న తర్వాత బాటిల్ పాలు ఇచ్చారని తెలిపారు. విధుల్లో ఉన్న ఆశా వర్కర్, వెంటనే శిశువును వైద్యపరీక్ష కోసం కంగ్టి పిహెచ్‌సికి తీసుకెళ్లమని సూచించారు. అయితే తల్లిదండ్రులు శిశువును మధ్యాహ్నం 2.00 గంటల సమయంలో కంగ్టిలోని ఒక ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. ఆ వైద్యుడు శిశువును పరిశీలించి, వెంటనే పిహెచ్‌సి కంగ్టి వైద్యఅధికారిని సమాచారం అందించారు.వైద్య అధికారి అక్కడికి చేరుకుని పరిశీలించగా, పెదవులు



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారిని నాగనిర్మల

నీలిరంగులోకి మారడం, ముక్కు నుండి నురుగు రావడం, శ్వాస ఆగిపోవడం గమనించారు. స్థానిక వైద్యుడు సుమారు మధ్యాహ్నం 2:15 గంటలకు శిశువు మృతి చెందినట్లుగా ప్రకటించారు. తరువాత పిహెచ్‌సి కంగ్టి వైద్య అధికారి, తల్లిదండ్రులను ఒప్పించి, పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని నారాయణఖేడ్ ఏరియాహాస్పిటల్‌కు తరలించారు. అక్కడ నిర్వహించిన మృతదేహ పరీక్ష (పీఎంఈ) ప్రకారం, శిశువు మరణానికి కారణం లారింజియల్ స్పాసమ్ (గొంతు పట్టు) వలన ఆహారం ఊపిరితిత్తుల్లోకి వెళ్లడం(అస్పిరేషన్) కారణమై ఉండవచ్చని డాక్టర్ అభిప్రాయపడ్డారు. కడుపులోని పదార్థాలను ప్రయోగశాల పరీక్షకు పంపించగా, తుది నివేదిక కోసం ఎదురుచూస్తున్నారు. అదేవిధంగా, అదే బూత్‌లో మొత్తం 108 మంది పిల్లలకు అదే వయల్ ద్వారా పల్స్ పోలియో చుక్కలు ఇవ్వబడగా, వారిలో ఎటువంటి ప్రతికూల ప్రతిక్రియలు నమోదు కాలేదు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఈ మృతిక వాక్సిన్‌కి సంబంధం లేని, ఆహారం ఊపిరితిత్తుల్లోకి పోవడం వల్ల ఉత్పన్నమైన శ్వాస ఆడక పోవడం(అస్ఫిక్షియా) కారణంగా సంభవించి ఉండవచ్చని భావించబడుతోంది. పోస్ట్‌మార్టం తుది నివేదిక అందిన తరువాత పూర్తి నివేదిక సమర్పించబడుతుందని తెలిపారు.

## ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలాల పరిశీలిన

**చౌటకూరు, అక్టోబరు 13 ప్రభాతవార్త :** ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అందోల్-జోగిపేట ఆర్‌డిఓ పాండు సోమవారం కాంగ్రెస్ నాయకుల తో కలిసి స్థలాలను పరిశీలించారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 1618లో 13 ఎకరాలు, సర్వే నంబర్ 202లో 1.35గల కొండయ్యకుంటను అధికా రులు, నాయకులు పరిశీలించారు. 13 ఎకరాల్లో ఇప్పటికే 10 ఎకరాలను ప్రభుత్వ న్యాయ కళాశాలకు కేటాయించడం జరిగిందని, మిగిలిన మరో మూడెకరాల ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించనున్నట్లు ఆర్‌డిఓ పాండు వివరించారు. గ్రామస్థులు కొండయ్య కుంటలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ఉపయోగించాలని సూచించగా స్పందించిన ఆర్‌డిఓ పాండు చెరువులు,కుంటల్లోని శిఖం భూములను వినియోగించుకునేందుకు అనుమతి ఉండదని ఆర్‌డిఓ గ్రామస్థులకు వివరించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహ దృష్టికి స్థలం విషయాన్ని తీసుకుపోయి మంత్రితో చర్చించాకే తుది నిర్ణయం తీసుకుంటామని ఆర్‌డిఓ పాండు వివరించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ డీఈఈ విక్రం, తహసీల్దార్ నామాల కిష్టయ్య, సిడిసి మాజీ చైర్మన్ భూంరెడ్డి సుభాష్‌రెడ్డి, గిర్ధవార్ ప్రమోద్, నాయకులు పార్కల రాంరెడ్డి, సరాఫ్‌పల్లి రామచంద్రారెడ్డి, కొల్కూరి ముగులయ్య, మంగలి చెన్నయ్య, శివంపేట మాజీ సర్పంచ్ రాజిరెడ్డి,కిరన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 14న ప్రత్యేక డ్రై డే నిర్వహించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

దోమలు వృద్ధి చెందకుండా అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో ఈనెల 14న ప్రత్యేక డ్రై డే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాల ప్రభావంతో దోమలు అధికంగా వృద్ధి చెంది విద్యార్థులపై ప్రభావం చూపకుండా అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలలో పంచాయతీ, మున్సిపల్, వైద్యాధికారుల సహకారంతో డ్రై డే నిర్వహించి నిలవనీటిని తొలిగించాలని.. ఫాగింగ్ చేయాలన్నారు. జిల్లాలోని చాలా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో సాంబారుకు బదులు పచ్చిపులుసు పెడుతున్నారని ఖచ్చితంగా మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు. వరి,మొక్కజొన్న, పత్తి తదితర పంటలు కోతకు వచ్చాయని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులు సమకూర్చి కొనుగోలు సరిగా జరిగేలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మండల అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలన్నారు.అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఆర్టీఐ వారోత్సవాలు నిర్వహించాలన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలన్నారు. నిర్మాణాలు పూర్తి చేసిన సబ్ సెంటర్లు, పిహెచ్‌సిలు ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు.సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, డిఆర్వో నాగ రాజమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**ఆకస్మిక తనిఖీలు...**

**కోహెడ/నంగునూర్, అక్టోబర్ 13,ప్రభాతవార్త :**

మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.రోగులకు అందుతున్న వైద్య సేవలు, డెంగ్యూ కేసులపై క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. హాజరు పట్టిక, ఓపి రిజిస్టర్ పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వేడివేడి ఆహారం తీసుకోవాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఆసుపత్రికి వచ్చిన వారికి సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెడికల్ ఆఫీసర్ అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్**

మండల పరిధిలోని శనిగరంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ధాన్యం లోడ్ చేసిన వెంటనే లారీలలో గోదాంలకు తరలించాలన్నారు.

**నంగునూరులో...**

నంగునూర్ మండలం బద్దిపడగ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా పరిశీలించారు. పప్పు బెండకాయతో సాంబారు, గుడ్డు మాత్రమే వండారని కామన్ డైట్ మెనూలో భాగంగా ఇంకో కూర వండలేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే మధ్యాహ్న భోజన ఉద్దేశమన్నారు. వంట సరుకులు, కూర పర్యవేక్షణ, భవనంపై నుంచి నీరు కారుతున్నా పట్టించుకోవడం లేదని ప్రిన్సిపల్ పద్మపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విధుల్లో నిర్లక్ష్యం చేయడంతో కఠిన చర్యలు తీసుకోవాలని డిఈవోను ఫోన్‌లో ఆదేశించారు. విద్యార్థులకు దగ్గరుండి స్వయంగా అన్నం వడ్డించారు. అన్నం సరిపడా తినాలని పారవేయవొద్దన్నారు.అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యమైన ఆహార పదార్థాలను వినియోగించాలని కూరల్లో రుచి మెరుగుపరచాలన్నారు. విధులు సక్రమంగా నిర్వహించాలని లేనియెడల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రవీణ్య

## రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోండి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి బ్యూరో అక్టోబరు 13, ప్రభాతవార్త :** ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు తక్షణ చర్యలు చేపట్టాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, మట్టి రోడ్లను త్వరగా మరమ్మతుచేసి, రవాణా సౌకర్యాలకు ఇబ్బందులు కలగకుండా పునరుద్ధరించాలని కలెక్టర్ సూచించారు.ఎస్టీ-ఎస్‌డిఎఫ్ నిధులు సమర్థవంతంగా వినియోగించి, రహదారి కనెక్టివిటీ కల్పించాలని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా పంచాయతీరాజ్ విభాగం నుండి మంజూరైన రహదారుల పనులకు టెండర్ ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పాడైపోయిన రోడ్లు,కల్వర్ట్‌లకు ఉపాధి హామీ పథకం కింద ప్రతిపాదనలు తీసుకుని తక్షణమే పనులు ప్రారంభించాలని సూచించారు.గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను సమీక్షించారు. గిరిజనతండాలకు రహదారి కనెక్టివిటీ, అన్ని ప్రధాన తండాలలో రహదారులు అందుబాటులోకి వచ్చేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, కొనసాగుతున్న రోడ్ పనులపై వివరాలను అధికారులు సమర్పించారు.ఈ సమీక్షలో పంచాయతీరాజ్ సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆర్ అండ్ బి డివిజనల్ ఇంజనీర్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగాధిపతులు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు



మహిళ హత్యకు గురైన సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

## నేరస్థులు ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదు

### మెదక్ ఎస్‌పి శ్రీనివాసరావు

**కొల్చారం, అక్టోబరు 13(ప్రభాతవార్త):** కొల్చారం పోలీసుస్టేషన్ పరిధిలోని ఏడుపాయల మొదటివంతెన సమీపంలోనిగల వెంచర్‌లో గిరిజన మహిళ అత్యాచారం, హత్యకు గురైన సంఘటన స్థలాన్ని మెదక్ జిల్లా ఎస్పీ డివిశ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్థులు ఎంతటి వారైనా వదిలి పెట్టేదిలేదన్నారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. హత్య చేసిన నేరస్థులను గుర్తించి త్వరలోనే పట్టుకుంటామన్నారు. వేగవంతంగా దర్యాప్తును చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట డిఎస్పీ ప్రన్నకుమార్, సిసిఎస్ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, కొల్చారం ఎస్సై మోహనొద్దీన్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**మర్కుక్, అక్టోబరు 13 (ప్రభాతవార్త):** కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పాములపర్తి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. మర్కుక్ ఎస్ఐ దామోదర్ కథనం ప్రకారం... పాములపర్తి గ్రామానికి చెందిన బ్యాగరి బాలకృష్ణ ఉదయం 11 గంటల సమయంలో గౌరారంకు వెళ్తుండగా కావేరి కంపెనీ కోల్డ్ స్టోరేజ్ సమీపంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు(టిఎస్13 ఎస్06 66) ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలకు గురైన బ్యాగరి బాలకృష్ణను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన కారు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిదిగా గుర్తించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

## వైన్స్ సిట్టింగ్ రూంలో అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

**హత్నూర అక్టోబరు 12, ప్రభాతవార్త:**

హత్నూర పోలీస్ స్టేషన్ దౌల్తాబాద్ గ్రామం పరిధిలోగల శ్రీశక్తి వైన్స్‌లోని సిట్టింగ్ రూంలో ఒక వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడని ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు మండలంపరిధిలోని సదుల్‌నగర్‌కు చెందిన పాల మల్లేశం(48) శనివారం మధ్యాహ్నం వైన్‌షాప్‌లో మద్యం తాగడానికి వచ్చాడని, రాత్రి 8:30 గంటల ప్రాంతంలో మృతి చెందాడని 100 కాల్‌కు ఫోన్ రావడంతో ఘటన స్థలాన్ని సందర్శించామని ఎస్సై తెలిపారు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్

**కోహెడ, అక్టోబరు 13, ప్రభాతవార్త:** నమ్మదగిన సమాచారం మేరకు కూరెల్ల గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులులేకుండా ట్రాక్టర్లల్లో అక్రమంగా ఇసుకను తీసుకెళ్తుండగా సోమవారం దాడి చేసి మూడు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న కుంచెం అరవింద్, దున్నపోతుల మహేష్, బుర్ర రాకేష్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించరు.



ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసిన దృశ్యం

## సిపిఆర్‌పై అవగాహన కల్పించిన డాక్టర్



విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సౌజన్య

**వెల్దుర్తి, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన వెల్దుర్తిలోని రాయరావ్ సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ సౌజన్య కళాశాల విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన కల్పించారు. సోమవారం కళాశాలకుచెందిన విద్యార్థులతో గుండెకొట్టుకోవడం ఆగిపోయినప్పుడు లేదా శ్వాసతీసుకోనప్పుడు ప్రాణాలు కాపాడుకోవడానికి చేసే అత్యవసర ప్రథమచికిత్స సిపిఆర్ అని ఆమె అన్నారు. సిపిఆర్ స్టార్ట్‌చేసేముందు 108కి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌తోపాటు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులనులను వెంటనే చెల్లించాలి

-టిపిటిఎఫ్

**గుమ్మడిదల, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయులకు రావాల్సిన ఉద్యోగ విరమణ పొందిన తర్వాత వచ్చే బెనిఫిట్స్ తదితర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని,ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నెలకు 700 కోట్ల రూపాయలు పెండింగ్ బిల్లుల చెల్లింపులకొరకు క్రమం తప్పకుండా విడుదల చేయాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు యమ్. సోమశేఖర్,రాష్ట్ర కౌన్సిలర్ కె.రాజిరెడ్డి గార్లు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.ఈ రోజు గుమ్మడిదల మండలంలోని దోమడుగు,బొంతపల్లి,గుమ్మడిదల,అనంతారం,కొత్తపల్లి, కానుకుంట, తదితర పాఠశాలల్లో సమస్యల సేకరణ ,సభ్యత్వ స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన పీఆర్సీ గురించి ఇంత వరకు ఊసేలేదు. అదే విధంగా సి.పి.యస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నాసర్ పటేల్,జిల్లా కార్యదర్శి బాలోజ్ రవిందర్ , టీపీటీఎఫ్ గుమ్మడిదల మండల అధ్యక్షుడు డి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్ష నియామకం

-కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల అభిప్రాయ సేకరణ

**నారాయణఖేడ్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్ష నియామకం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అభిప్రాయ సేకరణ కార్యక్రమం కాంగ్రెస్‌పార్టీ స్థానిక ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషిచేయడానికి అనుసరించాల్సిన వ్యూహాల గురించి కాంగ్రెస్‌పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గౌరవ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్‌కుమార్ శెట్కార్, గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ సజరిట లైత్ ప్లాంగ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్ష నియామకంలో కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల అభిప్రాయ సేకరణ ఈనెల 14న (నేడు) మంగళవారం ఉదయం 11 గంటలకు నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్‌హాల్ నందు నారాయణఖేడ్ బ్లాక్ (బి) అనగా నారాయణఖేడ్, మనూర్, నాగల్‌గిద్ద, నిజాంపేట్ 4 మండలాలకు సంబంధించిన ముఖ్యకార్యకర్తల సమావేశం, మధ్యాహ్నం 2 గంటలకు కంగ్టి బ్లాక్(బి) కంగ్టి, సిర్గాపూర్, కల్హేర్ 3 మండలాలకు సంబంధించిన ముఖ్యకార్యకర్తల సమావేశం జరగనుంది. కావున ఈకార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, మండలకాంగ్రెస్ అధ్యక్షులు, మాజీసర్పంచ్‌లు మాజీ ఎంపిటిసిలు, మాజీ జడ్పిటిసిలు, మాజీ ఎంపిపిలు, మాజీ వార్డుసభ్యులు, బిసి సెల్, ఎస్సీ సెల్, ఎస్టి సెల్, మైనారిటీకాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొనవలసిందిగా కోరారు.

## గీతంలో విజయవంతంగా ముగిసిన టెక్‌ఫెస్ట్ జోనల్స్

**పటాన్‌చెరు, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

భారతీయ సాంకేతికసంస్థ(ఐఐటి) బాంబే సహకారంతో హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఆసియాలోనే అతిపెద్ద సైన్స్ అండ్ టెక్నాలజీ ఫెస్టివల్, హైదరాబాద్ జోనల్స్ 2025ను విజయవంతంగా నిర్వహించింది. ఈ టెక్‌ఫెస్ట్ జోనల్స్ పోటీలు హైదరాబాదు ఎడిషన్‌లో నాలుగు ప్రధానపోటీలు జరగగా, ఈప్రాంతంలోని పాఠశాలలు, కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. దాదాపు 400 మందికిపైగా ఔత్సాహిక విద్యార్థులు ఈకార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్నవారందరికీ ప్రశంసాపత్రాలను అందజేశారు.

## ఇష్టారీతిగా వైన్స్ సిట్టింగ్ రూముల నిర్వహణ

**హత్నూర, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

నిబంధనలకు పాతరేస్తూ వైన్ షాపులు నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో వైన్స్ వినియోగదారుల ప్రాణాలకు రక్షణలేకుండా పోతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామం పరిధిలోని శ్రీశక్తివైన్స్‌లో శనివారం సాదు నగర్ గ్రామానికిచెందిన పాల మల్లేశం(48) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సిట్టింగ్ రూమ్‌లో తాగడానికి మధ్యాహ్నం వచ్చాడని, అతను మృతిచెందాడని రాత్రి 8:30గంటలకు ఫోన్‌రావడంతో అక్కడికి వెళ్ళామని హత్నూర ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వైన్‌షాప్ సిట్టింగ్‌రూమ్ నిర్వహణలో నిబంధనలు గాలికి వదిలేసి ఇష్టారీతిగా నిర్వహిస్తుండటంతో వైన్స్ తాగడానికి వచ్చేవారు బాగాతాగి అక్కడే బోర్లాపడిపోయిన సంఘటనలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాల మల్లేశం మధ్యాహ్నం వచ్చి అపస్మారకస్థితిలో ఉన్నప్పటికీ వైన్స్ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో అతనిప్రాణాలు గాలిలోకలిసిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అతను సిట్టింగ్‌రూమ్‌లో పడిపోవడం చూసి వెంటనే సమాచారం ఇచ్చి ఉంటే అతనికి వైద్యం అందించే అవకాశం ఉండేదని, కానీ అలా లేకుండా పోయిందని స్థానికులు అరోపిస్తున్నారు. వైన్స్ నిర్వాహకులు సిట్టింగ్ రూమ్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈవిషయంలో పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాడంతో వైన్స్ యాజమాన్యం ఇష్టారీతిగా వ్యవహరిస్తుందని వారు ఆరోపిస్తున్నారు. మృతునికి ఒక భార్య కూతురు ఉన్నారని గ్రామస్థులు తెలిపారు. బంధువులు, మిత్రులు గ్రామస్థులు వైన్స్ యాజమాన్యాన్ని నిలదీయడంతో లక్షరూపాయలు నష్టపరిహారంగా ఇవ్వడానికి ఒప్పుకున్నట్లు గ్రామస్థులద్వారా తెలిసింది. అడ్వాన్స్‌గా రూ.30000 ఇచ్చినట్లు తెలిసింది. ఈవిషయమై హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, పాల మల్లేశం మృతిచెందిన విషయం శనివారంరాత్రి 8:30గంటలకు సమాచారంరావటంతో, ఘటనాస్థలానికివెళ్లి పరిశీలించామని, అతను అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారని అన్నారు. మృతునిభార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఎక్సైజ్ ఎస్‌ఐని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

## మీర్‌పేట్ మాధవి హత్య కేసు విచారణ!

**సరూర్‌నగర్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన మీర్‌పేట్‌కు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి గురుమూర్తి భార్య మాధవి దారుణహత్యకు సంబంధించిన కేసు ఇక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణకురానుంది. ఈసంవత్సరం జనవరి 16వ తేదీన మాధవి అనే వివాహితను ఆమె భర్తే అత్యంత పాశవికంగా హత్యచేసి శవాన్ని నామరూపాల్లేకుండాచేసిన సంచలనసంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ కేసు విచారణలో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈనేపథ్యంలో కేసుదర్యాప్తులో భాగంగా సేకరించిన అన్ని సాక్ష్యాధారాలను పోలీసులు కోర్టుకు సమర్పించారు. ఇదిలా ఉండగా మాధవి హత్య కేసును త్వరగా తేల్చడానికి తాజాగా ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు విచారణకు రానుంది. ఈ నెల 17వ తేదీ నుండి విచారణ సాగనుంది. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో సత్వర విచారణ పూర్తయితే కేవలం రెండునెలల్లోనే తీర్పువచ్చే అవకాశం ఉంది. ఈకేసులో నిందితునిగా ఉన్న మాధవిభర్త రిటైర్ట్ ఆర్మీ ఉద్యోగి గురుమూర్తికి కఠినశిక్ష పడే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరతలేకుండా చూడాలి

-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



ఇసుక బజార్‌ను సందర్శించి తనిఖీచేస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు

**నర్సాపూర్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

ఇందిరమ్మ ఇళ్లలబ్దిదారులకు ఆర్థికభారాన్ని తగ్గించేందుకు రాష్ట్రప్రభుత్వ ఆదేశాలమేరకు టిజిఎండిసి ఆధ్వర్యంలో ఇసుక బజార్‌లను ఏర్పాటు చేశామని పేర్కొంటూ ఈమేరకు అధికారులు ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత లేకుండా చూడాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని మార్కెట్‌కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇసుక బజార్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తనిఖీచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్దిదారులకు ఉచితంగా ఇసుకను అందించడం జరుగుతుందన్నారు. లబ్దిదారులు కేవలం నల్గొండ నుంచి వస్తున్న ఇసుకకు ఒక్క మెట్రిక్ టన్నుకు రవాణా చార్జి కింద 1200 రూపాయలు చెల్లించి గ్రామ కార్యదర్శి ద్వారా టోకెన్ తీసుకొనివస్తే ఇసుకను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇసుక మాఫియాను తొలగించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఆయన తెలిపారు. మెదక్ జిల్లాకు 9వేల పైచిలుకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం వివిధదశలలో ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎండిసి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ వ్యవస్థపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు

-మున్సిపల్ అక్రమాలపై అదనపు కలెక్టర్‌కు గడీల శ్రీకాంత్‌గౌడ్ ఫిర్యాదు

-మాజీచైర్మన్ పాండురంగారెడ్డి, కమిషనర్ జ్యోతిరెడ్డి తదితరులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గడిల శ్రీకాంత్‌గౌడ్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

అమీన్‌పూర్ మున్సిపల్ వ్యవస్థపై ప్రజల నమ్మకం కోల్పోతున్నారని పటాన్ చెరు మాజీ జడ్పిటిసి, బిఆర్ఎస్ నాయకుడు గడీల శ్రీకాంత్‌గౌడ్ ఆవేదన వ్యక్తంచేశారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న వివిధ రకాల అక్రమాలపై అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు సోమవారం ఫిర్యాదుచేశారు. అమీన్‌పూర్ సర్వేనంబర్ 1016లో జరుగుతున్న అక్రమాలపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు. శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ, మాజీ మున్సిపల్‌చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తన పదవీకాలం ముగిసిన తర్వాత కూడా మున్సిపల్ కార్యాలయాన్ని అడ్డాగా చేసుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమ వసూళ్లు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, టిపిఓ పవన్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి కూడా ఈ అక్రమాలకు సహకరిస్తున్నారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలను విస్మరిస్తూ, అధికార దుర్వినియోగం జరుగుతుండటంతో మున్సిపల్ వ్యవస్థపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారని శ్రీకాంత్‌గౌడ్ ఆవేదన వ్యక్తంచేశారు. బాధితులు ఈ ఆగడాలనుండి విముక్తి పొందేలా ప్రభుత్వం తక్షణచర్యలు తీసుకోవాలని, న్యాయంజరిగేలా చూడాలని ఆయన అదనపు కలెక్టర్‌ను కోరారు.

## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన పిఎసిఎస్ చైర్మన్



ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న అనంతరెడ్డి

**వెల్దుర్తి, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

మండలంలో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని పిఎస్ఎస్ చైర్మన్ అనంతరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తి, కుకునూర్, ఎం జలాల్పూర్, మంగళపర్తి, మానేపల్లి, చర్లపల్లి, గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ మురళి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

## బస్సు కోసం విద్యార్థుల ధర్నా



మెదక్-చేగుంట రహదారిపై అంబాజీపేట వద్ద ధర్నాచేస్తున్న విద్యార్థులు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

స్కూల్‌కు వెళ్లేందుకు తగిన సమయంలో బస్సు సదుపాయం కల్పించాలని విద్యార్థులు రోడ్డెక్కి నిరసన వ్యక్తంచేసిన సంఘటన మండలపరిధిలోని అంజీపేటలో మెదక్-చేగుంట ప్రధానరహదారిపై సోమవారం చోటుచేసుకుంది. గత నెలరోజులుగా బస్సులు సమయానికి రాకపోవడంతో పాఠశాల, కళాశాలలకు సమయానికి వెళ్లలేకపోతున్నామని, సమయానికి ఒకే ఒక బస్సు వస్తుందని, ఆబస్సులో కాలుపెట్టలేనంతగా జనం ఉండటంతో వెళ్లలేకపోతున్నామని తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి మెదక్-చేగుంట ప్రధానరహదారిపై రాస్తారోకో చేయడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ నారాయణ గౌడ్ రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు వద్దకు వెళ్లి నచ్చచెప్పారు. ఆర్టీసీ డిఎం సురేఖతో మాట్లాడి ఆమె దృష్టికి తీసుకెళ్లగా, సమస్యను పరిష్కరిస్తామని తెలుపడంతో రాస్తారోకోను విరమించారు.

**బస్సులను సమయానికి నడపాలి...**

పాఠశాల సమయానికి బస్సును నడపాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రధానంగా చిన్నశంకరంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలలు, జడ్పి ఉన్నతపాఠశాలలు ఉండటంతో గవ్వలపల్లి, కొర్విపల్లి, కొండాపూర్, మాందాపూర్, జంగరాయి, మల్లుపల్లి, గజగట్లపల్లి, మడూర్, శాలిపేట, చెన్నాయిపల్లి తదితర గ్రామాల నుండి విద్యార్థులు రోజూ బస్సుల్లోనే వస్తుంటారు. అధికారులు స్పందించి విద్యార్థులు పాఠశాల సమయానికి బస్సులునడిపేలా చూడాలని మండలప్రజలు, విద్యార్థులు, తల్లితండ్రులు కోరుతున్నారు.

## ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించిన ఎఎస్‌సిఐ బృందం



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎఎస్‌సిఐ బృందం ప్రతినిధులు

**నర్సాపూర్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సోమవారం అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎఎస్‌సిఐ) బృందం సందర్శించింది. ఈ సందర్భంగా నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని వార్డుల అన్నింటిని వారు పరిశీలించారు. రోగులతో స్వయంగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతేగాక డయాలసిస్ సెంటర్‌ను, ఆపరేషన్ థియేటర్‌ను, ఇతర గదులను పరిశీలించి వైద్య సేవలను గురించి ఆరాతీశారు. ఈమేరకు నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పావనితో మాట్లాడి ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, ఆసుపత్రిలో వసతులు, మందుల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పావనితోపాటు ఆసుపత్రి సిబ్బంది, ఎఎస్‌సిఐ బృందం ప్రతినిధులు పాల్గొన్నారు.

# డిసిసి అధ్యక్ష పదవికి అభిప్రాయ సేకరణ

-పారదర్శక ఎన్నికకు సామాన్య కార్యకర్తల అభిప్రాయ సేకరణ

-అన్నివర్గాల అభిప్రాయాలమేరకే డిసిసి అధ్యక్షుని ఎన్నిక

-ఉత్తరాఖండ్ మహిళాకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు, ఎఐసిసి పరిశీలకురాలు జ్యోతి రౌతేలా



కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎఐసిసి పరిశీలకురాలు జ్యోతి రౌతేలా

**నర్సాపూర్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం గురించి డిసిసి అధ్యక్షుల నియామకాలకు అందరి అభిప్రాయ సేకరణ చేసి కాంగ్రెస్ నాయకులు అందరి ఆమోదంతోనే డిసిసి అధ్యక్షుల, ప్రజా నాయకుల నియామకం జరుగుతుందని ఉత్తరాఖండ్ మహిళాకాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎఐసిసి పరిశీలకురాలు జ్యోతి రౌతేలా అన్నారు. సోమవారం నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని ఎన్నికలో భాగంగా సంఘటన్ సృజన్ అభియాన్ తెలంగాణ కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉత్తరాఖండ్ కాంగ్రెస్‌పార్టీ మహిళా అధ్యక్షురాలు ఎఐసిసి పరిశీలకురాలు జ్యోతి రౌతేలా హాజరుకాగా రాష్ట్ర పరిశీలకుడు నసీర్ అహ్మద్, వైస్ ప్రెసిడెంట్ జగదీష్, వరలక్ష్మి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉత్తరాఖండ్ మహిళాకాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎఐసిసి పరిశీలకురాలు జ్యోతి రౌతేలా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సామాన్య కార్యకర్తలు నుండే ప్రజా నాయకులు ఉన్న ఎంపిక చేయడం కాంగ్రెస్ పార్టీ ప్రధానలక్ష్యం అన్నారు. ప్రతి జిల్లాలో స్థానిక నాయకులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించి ఆ అభిప్రాయం మేరకే జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షపదవిని నియామకం చేస్తామన్నారు. ఈమేరకు ప్రతి నాయకుడితో వ్యక్తిగతంగా చర్చించి వారందరి అభిప్రాయాలను టిపిసిసికి, ఎఐసిసికి పంపుతామని తెలిపారు. ఎఐసిసి నిర్ణయం మేరకే జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. పారదర్శక ఎన్నికకు నర్సాపూర్ నియోజకవర్గంలో అన్ని వర్గాల కార్యకర్తల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. అంతేగాక మండల, బ్లాక్, స్థాయిలలో కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలను సందర్శిస్తామని తెలిపారు. ప్రతినిత్యం కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే నాయకులకు సముచిత స్థానం లభిస్తుందని ఎఐసిసి పరిశీలకురాలు జ్యోతి రౌతేలా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి శ్రీనివాస్‌గుప్తా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశం, పిఎసిఎస్ చైర్మన్‌లు రాజుయాదవ్, వెంకట్‌రామ్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, పట్టణకాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, శివంపేట మండలకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవీన్‌గుప్తా, మండల మైనార్టీ అధ్యక్షులు అజ్మత్, మండల బిసి సెల్ అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, రుస్తుంపేట మాజీ ఎంపిటిసి అశోక్, యువజనకాంగ్రెస్ నాయకులు మణిదీప్, నియోజకవర్గస్థాయి కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాక వరసిద్ధి వినాయక దేవాలయ కమిటీ సభ్యుడికి సన్మానం

**ముషీరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

కాణిపాక వరసిద్ధి వినాయక దేవాలయ కమిటీసభ్యునిగా శ్రీపతి సతీష్ నియమితులవటం అభినంద నీయమని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా కొనియాడారు. సోమవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని పార్టీ కార్యాలయంలో శ్రీపతి సతీష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర బిసి కమిటీ అధ్యక్షులుగా పనిచేస్తున్న శ్రీపతి సతీష్‌ను తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఇటీవల కాణిపాక వరసిద్ధివినాయక దేవాలయకమిటీ సభ్యులుగా నియమించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టిడిపినేతలు బాలరాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్, ఓ.వెంకటేష్‌చౌదరి, శుక్రవేది, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఒకే ఇంటిపై 43 ఓట్లు నమోదును సుమోటోగా స్వీకరించిన జిల్లా ఎన్నికల అధికారి

**యూసుఫ్‌గూడ, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నకిలీ ఓటర్ కార్డులను ఇటీవల కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ పంపిణీ చేయడంతో ఈవిషయమై బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎన్నికల అధికారికి ఫిర్యాదుచేశారు. అదే విధంగా యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లోని 83231/5దీ 160నంబర్‌లో 43 ఓట్లు ఒకే ఇంటిపై ఉన్నట్లు కాంగ్రెస్‌నాయకులు నమోదు చేయించారు. ఈవిషయమంపై వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కొత్తా వెంకటేష్, పాడి కౌశిక్‌రెడ్డి, ముఠాగోపాల్, సుధీర్‌రెడ్డిలు, జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించారు.

## భారతీయ సంస్కృతీసంప్రదాయాలను రక్షించాలి

**బేగంబజార్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

భారతీయ సంస్కృతీసంప్రదాయాలను చాటుతూ, మన పండుగలను ఖండాంతారాల్లో నిర్వహించుకోవడం ఎంతోగర్వకారణమని ది తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్(టిటిఎ)వ్యవస్థాపకులు పైళ్ల మల్లారెడ్డి, డాక్టర్ విజయపాల్‌రెడ్డి, టిటిఎ అధ్యక్షులు నవీన్‌రెడ్డి మల్లిపెద్దిలు అన్నారు. టిటిఎ ఆధ్వర్యంలో అమెరికావ్యాప్తంగా 15రాష్ట్రాలలో ఘనంగా మెగా బతుకమ్మ వేడుకలు ముగిసినట్లు తెలిపారు. ఈవేడుకలు న్యూయార్క్, ఇండియానా పోలీస్, చార్లెట్, న్యూజెర్సీ, అట్లాంటా, సియాటిల్, డల్లాస్, అరిజోనా, టంప, బోస్టన్, ఫిలడెల్ఫియా, ఆలబామా, మియామీ, పోర్ట్‌ల్యాండ్ రాష్ట్రాలలో బతుకమ్మ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. అలాగే కొత్తగా ఏర్పాటుచేసిన అలబామా చాప్టర్ ఈసారి ఉత్సవాలలో పాల్గొనడం ఎంతో విశేషంగా నిలిచిందన్నారు. తెలంగాణ సంప్రదాయాలను ముందుకు తీసుకువెళ్తున్న మహిళా నాయకత్వ బృందమైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నేషనల్ బతుకమ్మ, సలహాదారులు కవితారెడ్డి, జనరల్ సెక్రటరీ శివారెడ్డి చేసినకృషికి టిటిఎ వారు అభినందించారు.

## 22న పుట్టపర్తికి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

**గోషామహల్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలకు వెళ్లాల్సిన భక్తులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హైదరాబాద్ డిపో-1 ఈనెల 22వ తేదీన ప్రత్యేక బస్సులను ఏర్పాట్లు చేస్తుందన్నారు. మహత్మాగాంధీ బస్‌స్టేషన్ నుండి పుట్టపర్తికి సూపర్‌లగ్జరీ బస్సులను, నాన్‌ఎసి బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. ఈనెల 22వ తేదీన సాయంత్రం 6గంటలకు మహత్మాగాంధీ బస్‌సేషన్ నుంచి బయలుదేరి మరుసటి ఉదయం 4గంటలకు పుట్టపర్తికి చేరుకుంటుందన్నారు. తిరిగి 23వ తేదీన బయలుదేరి 24వ తేదీన హైదరాబాద్‌కు చేరుకుంటుందన్నారు. చార్జి ఒకరికి 2100 రూపాయలు ఉంటుందన్నారు. భోజన, వసతి సదుపాయాలు, ఖర్చులు ప్రయాణికులదే బాధ్యత అన్నారు. దగ్గరలోని ఆర్‌టిసి ఏజెంట్‌ద్వారా బస్సును బుక్ చేసుకోవచ్చునన్నారు.

## పేదల ఆరోగ్యం పాలిట సంజీవిని సిఎం సహాయ నిధి

**దుండిగల్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

పేదల ఆరోగ్యం పాలిట సంజీవినిలా సిఎం సహాయ నిధి పథకం తోడ్పాటును ఇస్తున్నదని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంజూరు చేయించిన రూ.3,00,000 సిఎం రిలీఫ్‌ఫండ్ సంబంధిత 7చెక్కులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్‌నేత శంభీపూర్ క్రిష్ణ లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గద్దె నరసింహ, మాజీ ఎంపిటిసి ఆకుల భార్గవ్, పిఎసిఎస్ డైరెక్టర్ అర్కల జీతయ్య, మాజీ వార్డుసభ్యులు ఉప్పరి బాలకృష్ణ, నాయకులు లబ్దిదారులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం..

ఒక వ్యక్తి మృతి.. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

**జీడిమెట్ల, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాయిబాబానగర్ ఎక్స్‌రోడ్ దగ్గర, కారును కెటిఎమ్ బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో దుబ్బాకకు చెందిన సాయికుమార్ (38) స్పాట్లోనే చనిపోయాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, చికిత్సనిమిత్తం అతన్ని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. మృతిచెందిన సాయికుమార్‌ని గాంధీ మార్చురీకి తరలించినట్లు సూరారం పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

## ప్రమాదవశాత్తు ప్లాస్టిక్ సంస్థ యజమాని మృతి...

**దుండిగల్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

ప్రమాదవశాత్తు ప్లాస్టిక్‌సంస్థ యజమాని మిషన్‌మీదపడి తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన దుండిగల్ పోలీస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చింతల్ గురుమూర్తి నగర్‌కు చెందిన సిరిగారి శ్రీధర్ (43) బహదూర్‌పల్లిలోని టెక్ మహీంద్రా ఎదురుగా ఓ ప్లాస్టిక్‌సంస్థను నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. రోజులాగే సోమవారం ప్లాస్టిక్ కంపెనీలో మిషన్ దగ్గర పనిచేస్తుండగా మిషన్ మీదపడి తీవ్రగాయాల పాలయ్యాడు. నోరు, చెవులనుండి తీవ్రంగా రక్తస్రావం కలగడంతో చికిత్స నిమిత్తం అతనిని వెంటనే సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు. పోస్ట్‌మార్టంనిమిత్తం మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ పి.సతీష్ తెలిపారు.

## నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**దుండిగల్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

నేడు 33/11 కెవి అనిచ్ బొల్లారం సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని బౌరంపేట్ ఏఈ బి.సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ మల్లంపేట ఫీడర్, 11కేవీ వెంకట ప్రణీత్ ఫీడర్, 11కేవీ బాలాజీ ఎన్‌క్లేవ్ ఫీడర్ ఫీడర్, 11కేవీ కేవీఆర్ ఫీడర్‌లోని మల్లంపేట గ్రామం, బాలాజీ ఎన్‌క్లేవ్, ఆంధ్రా బ్యాంక్ వెనుక వైపు, ప్రణీత్ జెమ్స్, ఆకాష్ లేఅవుట్, డ్రీమ్‌వ్యాలీ కాలనీ, గ్రీన్‌పార్క్ కాలనీ, ఏపీఆర్ విల్లాస్, జిఎల్సి విల్లాస్, లీఫ్ విల్లాస్, కేవీఆర్ కాలనీ, శంభీపూర్ విలేజ్, హైరైజ్ విల్లాస్, మల్లంపేట విల్లాస్, స్ప్రింగ్‌వుడ్, జిఎన్‌ఎస్ విల్లాస్, నేచర్ బౌంటీ, లాక్రిడ్జ్ హోమ్స్, స్టెర్లింగ్‌హోమ్స్, కోటక్ సిగ్నేచర్స్ పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**నిజాంపేట్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని నందనవనం కాలనీ 19వ డివిజన్‌లలో రోడ్డు పూర్తిగా పాడువటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, కాలనీవాసులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని గతనెల సంప్రతించారు. హన్మంత్ రెడ్డి వారి సమ్యసపై స్పందించి సిసిరోడ్డుకు మున్సిపల్ ఫండ్స్ మంజూరు చేయించారు.



అవార్డులు అందుకుంటున్న దృశ్యం

## 11 క్లబ్‌లకు అవార్డుల అందజేత

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 13, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఆర్య వైశ్య భవనంలో ఆదివారం రాత్రి నిర్వహించిన పుల్లూరి శోభశ్రీ ప్రాంతీయ సదస్సులో అవార్డు ఫంక్షన్ నిర్వహించి రీజియన్‌లోని 11 క్లబ్‌లకు అవార్డులు అందజేశారు. వాసవీక్లబ్ సిద్దిపేట, వనితక్లబ్ సిద్దిపేట, యూత్‌క్లబ్ సిద్దిపేట, వాసవి క్లబ్ కొండపాక,వాసవిక్లబ్ ఇందిరమ్మకాలనీ, వాసవిక్లబ్ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ యూత్ క్లబ్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ వాసవిక్లబ్ కపుల్స్, దౌల్తాబాద్, వాసవి క్లబ్ హుస్నాబాద్ గ్రేటర్, వనితక్లబ్ హుస్నాబాద్‌లకు వారు చేసిన సేవా కార్యక్రమాలకు అలాగే రీజియర్ పరిధిలో ఉన్న నలుగురు జోన్ చైర్మన్‌లకు రీజియన్ చైర్ పర్సన్ పుల్లూరు శశాంక్ అరుణ, రీజియన్ కార్యదర్శి తోడుపునూరి కృష్ణవేణి చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దొంతు పాండురంగయ్య, రీజియన్ చైర్మన్ పుల్లూరి శశాంక్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ ప్రతినిధులు గంప శ్రీనివాస్, చందా శ్రీధర్, సిద్ది రాజేందర్, కడవెరుగు రాజనర్సు,గంప కృష్ణమూర్తి, నేతి వేణుకుమార్, పుల్లూరు శివకుమార్, పుల్లూరు శ్రీనివాస్, రత్నాకర్, యాద శ్రీనివాస్, బాలరాజేశం, పొశెట్టి శ్రీకాంత్, రవి, మహేష్, అర్వపల్లి హరికిరణ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జెఎసి ఏర్పాటుకు సన్నాహక సమావేశం



సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు

**కొమురవెల్లి, అక్టోబరు 13, ప్రభాతవార్త :** రాష్ట్ర ఉద్యోగుల జెఏసి చైర్మన్, టిఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు శ్రీమారం జగదీశ్వర్ సూచనల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన దేవాలయాలైన యాదగిగుట్ట, వేములవాడ, భద్రాచలం, కొండగట్టు, కొమురవెల్లి, బాసర ఆలయాల్లో పనిచేసే ఉద్యోగుల నూతన జెఏసి ఏర్పాటు కోసం సోమవారం శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆవరణలో సమావేశం ఏర్పాటు కోసం ఆలయ ఉద్యోగుల సంఘం సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జెఏసి కో చైర్మన్, రాష్ట్ర టిఎన్జీవో కార్యదర్శి ఉపాధ్యాయుల చంద్రశేఖర్, దేవాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పడిగన్నగారి అంజనేయులు, పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, అలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, జూనియర్ అసిస్టెంట్లు మధుకర్, లక్ష్మీరాజం, నరసింహులు, ప్లంబర్ విజయ్‌కుమార్, మధుసూదన్ శర్మ, అర్చకులు భాస్కర్, చిన్నమల్లికార్జున్, రవి, వినయ్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

**కొమురవెల్లి, అక్టోబరు 13, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని కొమురవెల్లిలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే ఐనాపూర్, కిష్టంపేట, మరిముత్యాలలో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం అమ్ముకున్న రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించాలని సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు.ధాన్యం కొనుగోలులో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఏపిఎం,డిప్యూటి తహశీల్దార్, ఎంపిడివో, మాజీ ప్రజాప్రతినిధులు, ద్వాక్రా గ్రూపు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ద్వితీయ వార్షికోత్సవ విశేష పూజలు

**గజ్వేల్, అక్టోబరు 13 (ప్రభాతవార్త):** పట్టణంలోని పాండవుల చెరువు కట్టపైన వెలసిన శ్రీకార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను నిర్వాహకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. చాడ నందబాలశర్మ వైదిక నిర్వహణలో అర్చకులు విఠాల సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, 7 గంటలకు గణపతిపూజ, స్వస్తి వాచనం, దేవతాహ్వానం, 9 గంటలకు శ్రీగణపతి ఆంజనేయ మూలమంత్ర హోమం, 10.30 గంటలకు అష్టోత్తర శతమాన్యుసూక్త అభిషేకం, 11.30 గంటలకు మూల విరాట్ విగ్రహానికి ప్రత్యేక అలంకరణ, మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## దుబ్బాక బస్ డిపోను పునరుద్ధరించాలి

**దుబ్బాక, అక్టోబరు 13, ప్రభాతవార్త :** దుబ్బాక బస్‌డిపోను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని టిజిఎస్, ఆర్‌టిసి చైర్మన్ యండి నాగిరెడ్డి మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి దుబ్బాక బస్ డిపోను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని సోమవారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ 1996 సెప్టెంబర్ 9న ప్రజల విరాళాలతో సుమారు 5 ఎకరాల స్థలాన్ని బస్ డిపో కోసం కేటాయించగా, 1998 ఆగస్టు 26న 54 బస్సులతో బస్ డిపో ప్రారంభమైందని తెలిపారు. ప్రారంభం నుండి దుబ్బాక డిపో అత్యుత్తమ సేవలు అందిస్తూ, 137 మంది సిబ్బంది ప్రతిరోజు 14,014 కి.మీ. ప్రయాణం చేసి, రూ.8 లక్షల దినసరి ఆదాయం సాధిస్తున్నారని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆర్‌టీసీ నష్టాల కారణంగా 2006 డిసెంబర్ 31న డిపో మూసివేయబడినప్పటికీ, ప్రజలు, ప్రజాప్రతినిధుల నిరసనలతో వారం రోజుల్లో 10 బస్సులతో పునఃప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుతం బస్సుల సంఖ్య 35కి పెరిగి, రాష్ట్రస్థాయిలో ఆదాయ పరంగా ముందున్న డిపోలలో దుబ్బాక డిపో ఒకటిగా నిలుస్తోందని, ఇటీవల 2025 రాఖీపూర్ణిమ సందర్భంగా రాష్ట్రంలో 8వ స్థానం, ఉమ్మడి జిల్లాలో 2వ స్థానం సాధించిందని తెలిపారు. దుబ్బాక డిపో నుంచి నిజామాబాద్, శ్రీశైలం, కరీంనగర్, వేములవాడ, ముస్తాబాద్, రామాయంపేట, దౌల్తాబాద్, చేగుంట, దొమ్మాట, యాదగిరిగుట్ట వంటి రూట్లలో కొత్త సర్వీసులు ప్రారంభించాల్సిందిగా ఎంపీ రఘునందన్ రావు తెలిపారు చేశారు. అలాగే దుబ్బాక బస్ డిపోకు కొత్త డిపో మేనేజర్‌ను నియమించి, 60 బస్సులతో పూర్తిస్థాయి పునరుద్ధరణ చేపట్టాలని ఎండీ నాగిరెడ్డి కోరారు.



ఎంపీకి వినతి పత్రం అందిస్తున్న నాగిరెడ్డి తదితరులు

# విద్యార్థి మృతిపై విచారణకు స్పెషల్ ఆఫీసర్

### బాధ్యులు ఎంతటి వారైన కఠిన చర్యలు తీసుకుంటాం.. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 13, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మండలంలోని జిల్లలగడ్డ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇటీవల 8వ తంగతి విద్యార్థి వివేక్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా ఈ కేసు విచారణకు సిద్దిపేట జిల్లా ఎస్సీ కార్‌రేషన్ ఈడి విజయ్‌భాస్కర్‌ను కలెక్టర్ హైమావతి నియమించారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థి అనువనాస్పదంగా మృతిచెందాడని తెలుసుకున్న ఆయన సోమవారం హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్బంగా విద్యార్థి మృతికి గల కారణాలను ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థి మృతిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కలెక్టర్‌కు ఆదేశించగానే కేసు విచారణకు స్పెషల్ ఆఫీసర్‌ను నియమించారని, ఈ మృతిపై హుస్నాబాద్ ఏసిపి సొదారపు సదానందం, పోస్టుమార్టం రిపోర్టు, స్పెషల్ ఎంక్వయిరీ ఆఫీసర్‌లు ఇచ్చే రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి కారకులైన వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి, జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ ఎలుక దేవయ్య, నియోజకవర్గ ఇంచార్జీ ఆరె కిషోర్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, మీడియా ఇన్‌చార్జీ జాల శ్రీనివాస్ ఉన్నారు.

**మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి...**

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు పేరెంట్స్ కమిటీ వినతి**

గురుకుల పాఠశాలలో అనుమానాస్పదంగా మృతి చెందిన విద్యార్థి సనాదుల వివేక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు తెలంగాణ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల నర్సింహులు ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, ఆహారంలో నాణ్యత, పర్యవేక్షణ లోపాలు ఉన్నాయన్నారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ 50లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్, శ్రీనివాస్, హరికృష్ణ, గంగారపు చేతన్, పర్శరాములు, సంపత్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# సమాచార హక్కు చట్టంలో జవాబుదారీతనం అవసరం

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సులో కలెక్టర్, అధికారులు

**సంగారెడ్డి మున్సి పాలిటీ అక్టోబరు 13 ప్రభాతవార్త:** సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు, అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార, సహాయ ప్రజా సమాచార అధికారులతో సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భముగా కలెక్టర్ మాట్లాడారు, ప్రతి సమాచార హక్కు చట్టంలో పారదర్శకత, జవాబుదారీతనం ఆవశ్యకమని, సమాచార హక్కు చట్టం నిర్వహణలో పారదర్శకత ప్రామాణికమని, అభ్యర్థులు దరఖాస్తు ద్వారా కోరిన సమాచారాన్ని చట్టం నిబంధనలకులోబడి అధికారులు వ్యవహరించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం, అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార, సహాయ ప్రజాసమాచార అధికారుల వివరాలతో బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలన్నారు. ఈ చట్టం అమలు ద్వారా పని సామర్థం పెరుగుతుందని, దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని నిబంధనలకులోబడి నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా అందించాలని తెలిపారు. ఈచట్టంలో పొందుపర్చిన మినహాయింపులు తప్ప మిగతా అన్ని విషయాల్లో ప్రజలు కోరిన సమాచారాన్ని చట్టం ప్రకారం అందించాలి. సమాచార హక్కు చట్టం 2005 ద్వారా సామాన్య ప్రజలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం తెలుసుకునే వెసులుబాటు కలిగిందన్నారు. ఈ చట్టం కింద వచ్చిన దరఖాస్తులను నిర్మిత గడువు లోగా సమాచారం అర్జీదారులకు అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పర్చుకుని ముందుకు సాగాలి

**-సిఐ రవికుమార్**

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 13 (ప్రభాతవార్త):** విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకొని లక్ష్య సాధన కోసం ముందుకు సాగాలని, పిల్లలు బాగుపడితే తల్లిదండ్రులకు అంతకంటే ఆనందం మరొకటి ఉండదని గజ్వేల్ సిఐ రవికుమార్ తెలిపారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని బిఎంఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, ఈవిటీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ షీటీమ్ దాని యొక్క ప్రాముఖ్యత, నిర్వహించే విధుల గురించి, సైబర్ నేరాల గురించి, ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాల వల్ల పరిణామాలు, సోషల్ మీడియా యొక్క పరిణామాల గురించి వివరించారు. అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

### నిబంధనలు పాటించి వాహనాలు నడపాలి

**-గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి**

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, ఒక రోడ్డు ప్రమాదం కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి పేర్కొన్నారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడుపవద్దని, మోటార్ సైకిల్ వాహనదారుడు హెల్మెట్ ధరించాలని అన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో కాళ్లు, చేతులు విరిగిన వారి పరిస్థితి చూస్తే అగమ్యగోచరంగా ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శిరీష, అధ్యాపకులు, గజ్వేల్ షీటీమ్ సిబ్బంది ఏఎస్ఐ శ్రీరాములు, హెడ్ కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## ప్రొఫెసర్ సాయిబాబా సేవలు చిరస్మరణీయం

**-డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి**

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 13 (ప్రభాతవార్త):** దళిత ఆదివాసి పీడిత ప్రజల హక్కుల కోసం పోరాడిన ప్రొఫెసర్ సాయిబాబా సేవలు చిరస్మరణీయమని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి అన్నారు. సోమవారం ప్రొఫెసర్ సాయిబాబా ప్రథమ వర్థంతి సందర్భంగా గజ్వేల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసి, గిరిజనుల కోసం పోరాడిన పాపానికి 90 శాతం వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాను సంవత్సరాల తరబడి ఒక చిన్న గదిలో ఉంచి సరైన తిండి పెట్టకుండా, కప్పుకోవడానికి దుప్పటి కూడా ఇవ్వకుండా నాలుగు గోడల మధ్య నరకయాతన పెట్టడం జరిగిందన్నారు. అత్యంత పేదరికంలో తెలుగు గడ్డమీద పుట్టిన ప్రొఫెసర్ సాయిబాబా ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ స్థాయికి ఎదిగి వేల మందికి హితోపదేశం చేసిన ప్రొఫెసర్‌ను చూసి ఓర్వలేక రాజ్యం కుట్రపన్ని కటకటాల పాలుచేసిందన్నారు. చనిపోయే ముందు నిరాధారణ కేసు అని సుప్రీంకోర్టు తేల్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు మైస స్వామి, దళిత మాజీ ఉపసర్పంచ్ రాజ్‌కుమార్, డిబిఎఫ్ మండల అధ్యక్షుడు ఉషగారి చంద్రం, క్యాసారం చంద్రం, సల్లా ఎల్లం, కాయితి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# క్యూ నెట్ నమ్మి ఎవరూ మోసపోవద్దు

### క్యూ నెట్ మనీ సర్క్యులేటింగ్ పేరిట మోసం చేసిన ఇద్దరు అరెస్ట్.. సిపి ఎస్.ఎం.విజయ్‌కుమార్




మాట్లాడుతున్న సీపీ ఎస్ఎం విజయ్‌కుమార్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** క్యూనెట్ ఒక మహమారి అని నమ్మి ఎవరూ మోసపోవద్దని సీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సిద్దిపేటలోని సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. క్యూనెట్ మనీ సర్క్యులేటింగ్ పేరిట యువకుడిని మోసం చేసి ఆత్మహత్యకు కారణమైన ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. క్యూనెట్ మనీ సర్క్యులేటింగ్ ఆన్‌లైన్ గేమ్ క్యూ నెట్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్యూ నెట్ తదితర ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ డబ్బులు పెట్టి ఎవరూ మోసపోవ్వదని, మోసపోయి ప్రాణాలు కోల్పోవద్దని చెప్పారు. వర్గల్ మండలం వేలురూ గ్రామానికి చెందిన బడుగు హరికృష్ణ(26) కొంత కాలంగా అప్పులు చేసి ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్, అధిక లాభాలు వస్తాయని ఆశపడి పెట్టుబడిపెట్టి నష్టపోయాడని తెలిపారు. దీంతో హరికృష్ణ మనస్తాపం చెంది సూసైడ్ నోట్ రాసి ఈనెల 9న తన ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. దీంతో బాధితుడు గంగారాం ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా బెట్టింగ్ యాప్‌లలో రూ.8 లక్షల పెట్టి మోసపోయినట్లు తెలిందన్నారు. ఈక్రమంలో హరికృష్ణ చేసిన అప్పులను తండ్రి నాగరాజు అప్పులు తెచ్చి తీర్చినట్లు తెలిపారు. నాగరాజు తెచ్చిన అప్పులు తీర్చడానికి వ్యాపార మార్గాలు వెతుకుతుండగా అదే గ్రామానికి చెందిన కాల్వల మణికంఠరెడ్డి పరిచయం అయి తాను కొంత పెట్టుబడి పెట్టి అధిక మొత్తంలో లాభాలు సంపాదిస్తున్నానని తన లాగే కొంత డబ్బు పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చుని మణికంఠ మెంబర్‌గా జాయిన్ చేసుకున్న అతని పెద్దనాన్న కూతురు ఆలేఖ్య ఇరువురు కలిసి హరికృష్ణను నమ్మించినట్లు తెలిపారు. హరికృష్ణ క్యూనెట్ స్కామ్‌లో మోసపోయానని ఇతరుల ద్వారా డబ్బులు కంపెనీకి కట్టిస్తే వారు తన లాగానే మోపోతారని భావించి మనస్థాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. హైదారాబాద్‌లో పలువురు ఇలాంటి స్కీమ్‌ల్లో చేర్పించి అమాయకులను మోసం చేస్తున్నారని వారిని పట్టుకొని చట్టపరంగా శిక్షిస్తామన్నారు. మని సర్క్యులేషన్ స్కీమ్ అనేది పెద్ద మోసమన్నారు. క్యూ నెట్ సింగపూర్ వేదికగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇదొక విషవలయం లాంటిందని ఇలాంటి స్కీమ్‌లో చేరే వారు ఆర్థిక ఇబ్బందులకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించి శిక్షిస్తామన్నారు. క్యూ నెట్ వంట వాటిని ప్రమోట్ చేయడం నేరమన్నారు. ఎంత పెద్ద సెల్రబ్రిటీ అయినా సరే చట్టం ముందు దోషులేనని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. క్యూ నెట్ స్కామ్‌లో మోసం చేసిన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం చెట్లగౌరారంకు చెందిన ఉప్పలపు అలేఖ్య(25), వర్గల్ మండలం వేలూరు గ్రామానికి చెందిన కాల్వల మణికంఠరెడ్డి(23) నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మిగితా నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. సమావేశంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ కుశాల్కర్, గజ్వేల్ ఏసిపి నరసింహులు, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, అక్టోబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలతో ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు రావడంతో పాటు, విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు వివిధ పరిశ్రమల సహాయ సహకారాలతో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో మన ఊరు మన బడి పథకం ద్వారా 67 లక్షల రూపాయలతో నిర్మించిన 4 అదనపు తరగతి గదులు, ఆర్డిసి కాంక్రీట్ ఇండస్ట్రీస్ సిఎస్ఆర్ నిధులతో 10 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన మరో రెండు అదనపు తరగతి గదులను సోమవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ, నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో ఉద్యోగాలు సాధిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. పది లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో పాఠశాలకు రంగులు వేయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావునాయక్, పంచాయతీరాజ్ డిఇ సురేష్, ప్రమోద్‌గౌడ్, ఆర్డిసి పరిశ్రమ ప్రతినిధి నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విలీన గ్రామాలలో శరవేగంగా అభివృద్ధి పనులు...**

**పటాన్‌చెరు, అక్టోబరు 13,ప్రభాతవార్త:** తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ఇటీవల విలీనమైన గ్రామాలలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ ముత్తంగి గ్రామ పరిధిలోని వివిధ కాలనీలలో 12 కోట్ల 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ.. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా విలీనమైన గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ముత్తంగి పరిధిలోని నూతన కాలనీలలో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, తహసీల్దార్ రంగారావు, మున్సిపల్ కమిషనర్ అజయ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఉపేందర్, మాజీ వైస్ ఎంపీపీలు స్వప్నశ్రీనివాస్, ప్రభాకర్‌గుప్తా, నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి : ప్రిన్సిపాల్

**హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 13, ప్రభాతవార్త :** ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి బిక్షపతి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బేసిక్ కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నూరి గంగాధర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్ ప్రత్యేక అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్ బేసిక్ కోర్సులో శిక్షణ పొంది కంప్యూటర్ నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్ చంద్రమౌళి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

**-అత్తింటివారే హత్య చేశారని తల్లిదండ్రుల ఆరోపణ**

**ములుగు, అక్టోబరు 13 (ప్రభాతవార్త):** అనుమానాస్పదస్థితిలో వివాహిత ఉరేసుకొని మృతిచెందిన సంఘటన ములుగు మండలం కొక్కొండ గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం... దౌల్తాబాద్ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన తిప్పగాని మల్లాగౌడ్ కూతురు అశ్విని(26)ను 2019 సంవత్సరంలో ములుగు మండలం కొక్కొండ గ్రామానికి చెందిన గుంటిపల్లి రవిగౌడ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వారికి 5 సంవత్సరాలు కూతురు, 2 నెలల బాబు ఉన్నారు. కాగా అశ్వినికి అత్త, మరిదితో తరచూ గొడవలు జరుగుతుండడంతో విషయాన్ని తండ్రి మల్లాగౌడ్‌కు తెలిపింది. కుటుంబంలో గొడవలు జరగడం సహజమేనని, సర్దుకుపోవాలని కూతురుకు చెప్పాడు. ఈ క్రమంలో ఏమి జరిగిందో తెలియదు కానీ ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో అశ్విని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని అశ్విని తండ్రి మల్లాగౌడ్‌కు అశ్విని అత్తగారి ఇంటిపక్కన ఉన్న వారు సమాచారం అందించారు. వెంటనే గ్రామానికి చేరుకున్న మల్లాగౌడ్ మంచంపై పడుకోబెట్టిన అశ్విని మృతదేహాన్ని చూడగా ఆమె మెడకు చున్నీ కట్టి ఉందని, కూతురును అత్తింటివారే హత్య చేశారని అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ములుగు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అశ్విని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఎస్ఐ విజయ్‌కుమార్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డిల సమక్షంలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## భార్యతో గొడవ పడి వ్యక్తి ఆత్మహత్యా యత్నం

**-కాపాడిన రక్షకబటులు**

**చౌటకూరు, అక్టోబరు 13, ప్రభాతవార్త:** భార్యతో గొడవపడి క్షణికావేశంలో మంజీర నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిస్తున్న వ్యక్తిని రక్షకబటులు కాపాడిన సంఘటన మండల పరిధిలోని శివంపేట సమీపంలోని మంజీర నది వద్ద ఆదివారం రాత్రి జరిగింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలాఉన్నాయి. అందోలు మండలం బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన విఠల్‌గౌడ్(37) భార్య, పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. భార్య లక్ష్మితో విఠల్‌గౌడ్ గొడవ పడి ఆదివారం రాత్రి 8.50 గంటల ప్రాంతంలో శివంపేట సమీపంలోని మంజీర నది వంతెన వద్దకు చేరుకోవడాన్ని గమనించిన పోలీసులు బైక్‌పై వెంబడించి రహదారిపై వెళుతున్న ప్రయాణీకుల సహకారంతో విఠల్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ నర్సింలుకు సమాచారం అందించగా నర్సింలు సంఘటన స్థలానికి తన అనుచరులతో చేరుకుని విఠల్‌గౌడ్‌ను తీసుకుపోయాడు. విఠల్‌గౌడ్ ప్రాణాలు కాపాడిన పోలీసులకు గ్రామస్థులు కృతజ్ఞతలు చెబుతూ అభినందించారు.

## చేపల వేటకు వెళ్లిన యువకుడు నదిలో గల్లంతు

**కొల్చారం, అక్టోబర్ 13(ప్రభాతవార్త):** చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు మంజీరా నదిలో గల్లంతైన ఘటన కొల్చారం మండలం అప్పాజీపల్లి శివారులోని మంజీరా నది ప్రవాహం సమీపంలో చోటుచేసుకుంది.అప్పాజీపల్లి గ్రామానికి చెందిన కన్నెబోయిన సురేష్(24) సోమవారం ఉదయం చేపల వేటకోసం వెళ్లగా ఏడుపాయల రెండవ బ్రిడ్జివద్ద మంజీరానదిలో గల్లంతయినట్లు గ్రామస్తులు తెలిపారు. సురేష్ కోసం గజ ఈతగాళ్లు నదిలో గాలిస్తున్నారు. మృతుడికి తల్లి లక్ష్మీ ఉంది.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

**చిన్నశంకరంపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి గజగట్లపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కిష్టమ్మ, యాదగిరి దంపతుల కుమారుడు ప్రసాద్(20) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా పని దొరకకపోవడంతోపాటు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువైపోవడంతో సతమతమయ్యేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం బయటకు వెళ్లిన ప్రసాద్ రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో కంగారు పడిన కుటుంబసభ్యులు బంధువులు,స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం గ్రామ పారిశుధ్య కార్మికులు అటవీ ప్రాంతం నుంచి వస్తుండగా ప్రసాద్ ద్విచక్రవాహనం కనిపించగా అక్కడే అటవీ ప్రాంత పరిసర ప్రాంతాల్లో వెతకగా అక్కడ ఉన్న చెట్టుకు ప్రసాద్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడి కనిపించాడు. మృతుని తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మెంటర్స్ అవార్డు అందుకున్న ప్రభు



ఆవార్డు అందుకుంటున్న ప్రభు

**సదాశివపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
విద్యార్థులకు చదువుతోపాటు వారి మేధోశక్తిని పెంచడానికి అనేక కార్యక్రమాల నిర్వహణలో చురుకుగా పనిచేసినందుకుగాను రాష్ట్రస్థాయి మెంటర్స్ అవార్డు మాలి పటేల్‌ప్రభుకు దక్కింది. హైదరాబాదులోని బిపిఆర్ ఆడిటోరియంలో ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం చేతులమీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమమెంటర్స్ అవార్డు అందుకున్నారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని శాంతినికేతన్ విద్యాలయాన్ని 32 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. తనకు ఈ రాష్ట్రస్థాయి అవార్డు రావడానికి సహకరించిన శేఖర్‌రావు, యాదగిరి జయసింహగౌడ్ పూసల లింగగౌడ్, ప్రశాంత్, కుమార్, వెంకటేశం, ఆందోని రెడ్డిలకు ధన్యవాదాలు తెలుపారు. తానుచేసిన కృషికి అన్నివేళలా తోడుగా ఉన్న కుటుంబ సభ్యులకు, సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆదర్శ్‌రెడ్డి


బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
జూబ్లిహిల్స్ నియోజకవర్గంలోని రహ్మత్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ విస్తృతసాయి సమావేశంలో పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ కో-కన్వీనర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు. బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి, జూబ్లిహిల్స్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి సునీత గోపినాథ్ భారీ మెజార్టీతో శాసనసభ తలుపులు తట్టేలా తీసుకోవాల్సిన జాగ్రతలపై సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కల్వకుంట్ల తారకరామారావు, మాజీమంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమ్మూద్ అలీ, హరీశ్‌రావు, పద్మారావుగౌడ్, సబితా ఇంద్రారెడ్డిలు దిశా నిర్దేశం చేశారని ఆదర్శ్‌రెడ్డి పేర్కొన్నారు.

## బాధ్యతలు ఓ చోట-విధులు మరో చోట

**-ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కెవిపిఎస్**



నాగల్‌గిద్దలో ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

**నాగల్‌గిద్ద, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన నాగల్‌గిద్దలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించాల్సిన సిద్దారెడ్డి మరో పాఠశాలలో విధులు నిర్వహించడం ఏమిటని కెవిపిస్ జిల్లా ఉపాధ్యక్షులు గణపతి విచారం వ్యక్తంచేశారు. సోమవారం నాగల్‌గిద్దలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గణపతి తహసీల్దార్‌కు ఫిర్యాదు పత్రం అందచేశారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ పాఠశాలలో విధులు నిర్వహించాలని జిల్లా ఉన్నతాధికారులు సిద్దారెడ్డికి బాధ్యతలు అప్పగిస్తే మరో పాఠశాలలో సిద్దారెడ్డి విధులు నిర్వహిస్తే నాగల్‌గిద్ద పాఠశాలలో విద్యాప్రమాణాలు దిగజారవా అని నిలదీశారు. జిల్లా అధికారులు స్పందించి సిద్దారెడ్డి నాగల్‌గిద్ద జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గణపతి డిమాండ్‌చేశారు.

## నాగల్‌గిద్దలో పోషణ మాసం



నాగల్‌గిద్దలో పోషణ మాసంలో పాల్గొన్న అధికారులు

**నాగల్‌గిద్ద, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహార ప్రాముఖ్యతను అధికారులు వివరించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ సిడిపిఓ సుజాత, ఎసిడిపిఓ సుశీల, మంజుల, తహసీల్దార్ శివకృష్ణ, ఎంఈఓ మన్మద కిశోర్, సూపర్‌వైజర్ ప్రశాంతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## నేడు పట్టణంలో వాహనాల వేలం

**జహీరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
ఎన్‌డిపిఎస్ కేసులలో పట్టుబడిన 9 వాహనాలను ఈ నెల 14న ఉదయం 11 గంటలకు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్‌అండ్‌ఎక్సైజ్ అధికారి ఆదేశాలమేరకు ప్రొహిబిషన్‌అండ్‌ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో వేలం వేస్తున్నట్లు, ఆసక్తిగలవారు వేలంపాటలో పాల్గొని వాహనాలను స్వంతం చేసుకోవచ్చని ప్రొహిబిషన్‌అండ్‌ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో మ్యాక్స్ ఆర్100 37 సుజుకి బైక్, బజాజ్ చేతక్ స్కూటర్, హీరో హోండా స్ప్లెండర్ ప్లస్, హీరో ప్యాషన్ ప్రో, హోండా షైన్, హీరో స్ప్లెండర్ ప్లస్, యమహా ఎఫ్25, హీరో గ్లామర్, హోండా షైన్ బైకులు ఉన్నాయని, ఆసక్తిగలవారు వేలంపాటలో పాల్గొని వాహనాలను తమ స్వంతం చేసుకోవచ్చన్నారు.

## మున్నూరుకాపు సంఘం అధ్యక్షులుగా చింతల రాములు

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
రామాయంపేట పట్టణ మున్నూరుకాపు సంఘం బెడ-3 నూతన అధ్యక్షులుగా చింతల రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షులుగా వెల్మల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా మెట్టు రాజు, కోశాధికారిగా మన్నె గోపాల్, సహాయ కార్యదర్శిగా ఈర శ్యామ్‌లను కార్యవర్గసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా చింతల రాములు మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం బలోపేతం గురించి మరింత కృషి చేస్తానని, మున్నూరు కాపులు అంటే కేవలం వ్యవసాయరంగమే కాకుండా అన్నిరంగాలలో ముందుండి నడుపుతారని, దీనికి నేను కృషి చేస్తానని తెలిపినారు.

# స్థానిక ఎన్ని'కల'లేనా..!

**-పార్టీ టికెట్లకు ప్రయత్నిస్తున్న ఆశావహులు**
**-ఎలక్షన్లకు ఎదురు చూపులు**
**-బడానాయకుల చుట్టూ ప్రదక్షిణలు**



**టేక్మాల్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రభుత్వం బిసి రిజర్వేషన్లపై జివోను తెచ్చి ఆయా ఎంపిటిసి, జడ్పిటిసి స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేయడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకావడంతో ఆశావహుల సందడి ఎక్కువైన కొన్నిగంటల్లోనే నోటిఫికేషన్‌లపై హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ఆశావహులు స్థానికసంస్థల ఎన్నికలు కలలేనని ఎన్నికలు ఎప్పుడు వస్తాయోనని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. దీంతో ఎన్నికల్లో పోటీచేసే ఆశావహులు ఎన్నికలు వాయిదాపడ్డ నాయకుల చుట్టూ వారి ఆశీర్వాదం కోసం తిరుగుతూ ప్రయత్నాలు ఆపడం లేదు. పార్టీటికెట్ల కోసం ప్రయత్నిస్తున్న ఆశావహులు ఆయా రాజకీయ పార్టీల నుంచి పార్టీ టికెట్ జడ్పిటిసి, ఎంపిటిసిగా పోటీ చేసేందుకు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ప్రజల ఆశీర్వాదం కోసం ఇప్పటి నుంచే కుల సంఘాల నాయకులు, యువజన సంఘాలతో సమావేశాలు నిర్వహించి తమకు అనుకూలంగా ఎన్నికల్లో పనిచేయాలని వారిమెప్పు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. టేక్మాల్ ఆయాపార్టీల్లో రెండు వర్గాలు ఉండటంతో ఎవరికివారు తమ స్వంతవర్గం వారికి టికెట్లు ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు ఆశావహులు అందరి మెప్పు పొందేందుకు ఒకరికి తెలియకుండా మరొక నాయకుని ఆశీర్వాదం కోసం పార్టీ టికెట్‌కు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాల్లో సామాజికవర్గం ఎక్కువ ఉన్న వారందరూ ఐకమత్యంతో తమ సామాజిక వర్గానికి చెందినవారికే పట్టంకట్టేందుకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. గ్రామాల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామస్థాయిలో నాయకులు, ఆయాపార్టీల నాయకులకు తమనాయకులకు అభిప్రాయాలు తెలియజేస్తున్నట్లు సమాచారం.

**రాజకీయ రంగులుమార్చే నాయకులపట్ల అప్రమత్తంగా ఉండాలి...**
ప్రస్తుతం గ్రామాల్లో రాజకీయ రంగులు మార్చే నాయకుల పట్ల ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు గ్రామాల్లో నాయకుల వద్ద తమదే ఆధిపత్యం సాగుతుందని గ్రామాల్లో ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్న వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో యువత గ్రామాన్ని అభివృద్ధిపథంలో నడిపించి అవినీతిరహిత పాలన చేసేవారికే పట్టంకట్టాలని బహిరంగంగానే చర్చించకుంటున్నారు. గ్రామాల్లో మద్యంవల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని మద్యనిషేధిత గ్రామాలను తీర్చిదిద్దేవారినే ఎన్నికల్లో ఆశీర్వదించనున్నట్లు మరికొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## కబ్జాలపై చర్య తీసుకోవాలని వినతి



జిల్లా కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**టేక్మాల్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
టేక్మాల్ మండల పరిధిలోని పలు సోలార్ ప్లాంట్లు, కంపెనీలు అసైన్డ్ భూములను అక్రమంగా కబ్జాలు చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆందోల్ నియోజకవర్గ సింగూరు జలాల సాధనసమితి అధ్యక్షుడు కంచరి బ్రహ్మం మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో గ్రీవెన్‌సేల్‌లో వినతిపత్రం అందజేశారు. టేక్మాల్ మండలపరిధిలోగల వివిధ సోలార్ ప్లాంట్లు కంపెనీ ప్రభుత్వ భూములు అనగా పేదప్రజలకు పంపిణీచేసిన అసైన్డ్, ఇతర ప్రభుత్వ భూములు 30, 34, 108 సర్వే నంబర్లలో భూములున్నాయి. 2005 సంవత్సరంలో ప్రభుత్వం వారు పేదప్రజల అభివృద్ధికి సుమారు 100 పైగా లబ్ధిదారులకు భూపంపిణీ కార్యక్రమంలో భాగంగా పట్టాలు ఇచ్చారు. కాగా వారికి పొజిషన్, కబ్జాలు చూపించలేదు. భూములను సదరు సోలార్‌ప్లాంటు గ్రామశివారులలో విస్తరించే ఉద్యేశంతో అక్రమంగా కబ్జాలుచేసి భూములు పేదప్రజలకు దక్కకుండా చేసి అటు ప్రభుత్వానికి ఎటువంటి రుసుములు చెల్లించకుండానే కొన్నికోట్ల రూపాయలు సొమ్ము చేసుకున్నారు. ఈభూములను పేదప్రజలకు, లబ్ధిదారులకు పొజిషన్లు చూపించేవిధంగా సోలార్ ప్లాంట్ల కబ్జాల నుండి విడిపించి లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. కేవలం పై గ్రామ శివారులోనే కాకుండా ఎలకుర్తి, పల్వంచ, టేక్మాల్ గ్రామ శివార్లలలో కూడా పలు ప్రభుత్వభూములు, నక్షబాటలు, కాలువలు కబ్జాలు చేసినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే తగు చర్యలు తీసుకుని ప్రజలకు, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

## కెజిబివిలో పిఎం మోడీతో లైవ్ ఇంట్రాక్షన్



పిఎం మోడీతో లైవ్ ఇంట్రాక్షన్‌లో పాల్గొన్న అధికారులు

**రామచంద్రాపురం, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
ప్రధానమంత్రి నరేంద్రమోడీతో రామచంద్రాపురం మండలపరిధిలోని ఉస్మాన్‌నగర్ గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం లైవ్ ఇంట్రాక్షన్ అయ్యారని మండలవిద్యాధికారి పిపి.రాథోడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని రెండు కెజిబివి విద్యాలయాలతో ప్రధానమంత్రి నరేంద్రమోడీతో లైవ్ ఇంట్రాక్షన్ నిర్వహించగా అందులో రామచంద్రాపురం మండలానికి అవకాశం దక్కడం శుభపరిణామమని బాధ్యులు ఆనందం వ్యక్తంచేశారు. లైవ్ ఇంట్రాక్షన్‌లో సమగ్రశిక్ష జెడి.రాజవ్, సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ నుంచి ఎఎంఓ బాలయ్య, జిల్లా సైన్స్ ఫెయిర్ అధికారి సిద్దారెడ్డి, జిల్లా జెండర్ ఆండ్ ఈక్విటీ కో-ఆర్డినేటర్ సునితాకన్న, మండలవిద్యాధికారి పిపిజరాథోడ్, యూనిసర్ కో-ఆర్డినేటర్ బ్రిందా, పాఠశాల ప్రత్యేక అధికారి కె.కవిత తదితరులు పాల్గొన్నారు.

## అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన నాగ్సాన్‌పల్లి గ్రామస్థులు

**సదాశివపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
సంగారెడ్డిజిల్లా అడిషనల్‌కలెక్టర్ చంద్రశేఖర్‌కు నాగ్సాన్పల్లిగ్రామస్థులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అకాలవర్షాలు కురవడంతో నాగ్సాన్‌పల్లి నల్లవాగు పొంగి గ్రామంలోని బిటిరోడ్ పూర్తిగా తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. ఈవిషయాన్ని జిల్లా అడిషనల్‌కలెక్టర్ చంద్రశేఖర్‌కు తెలుపుతూ, తాత్కాలిక మరమ్మతుపనులు ప్రారంభించాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. సంగారెడ్డిజిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ వెంటనే స్పందించి తాత్కాలికంగా మరమ్మతులకు రూ.1,50,000 మంజూరు చేయడం జరిగింది.

## సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుకేంద్రాలు

**-టేక్మాల్ సొసైటీ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి**


ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్న దృశ్యం

**టేక్మాల్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
ధాన్యం కొనుగోలుకేంద్రాలను టేక్మాల్ మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించనున్నట్లు సొసైటీ చైర్‌పర్సన్ యశ్వంత్‌రెడ్డి తెలిపారు. టేక్మాల్‌లోని సహకార సంఘం గోదాం వద్ద ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించడానికి అవసరమైన ఏర్పాట్లను సోమవారంచేశారు. గోదాం పరిసర ప్రాంతాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి ప్థలాన్ని చదునుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలపరిధిలోని ధనూర, టేక్మాల్, పల్వంచ, కోరంపల్లి, బర్ధీపూర్, చంద్రుతాండ, ఎలకుర్తి, కాదులూర్ గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సొసైటీ ధాన్యం కొనుగోలుకేంద్రాల్లోనే రైతులు అమ్ముకోవాలని, ప్రైవేటు వ్యక్తులకు విక్రయించి మోసపోవద్దన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కొనుగోలుకేంద్రాల్లో ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఇంకా ఎక్కడైనా అవసరమైతే తప్పనిసరిగా కొనుగోలుకేంద్రాలను ఏర్పాటుచేయడానికి సొసైటీ సిద్ధంగా ఉందన్నారు. ఇందులో సిఈఓ సాయిలు, డైరక్టర్లు కిషన్, శ్రీశైలం, పలువురు నాయకులు, రైతులున్నారు.

## విద్యార్థులు ఉన్నతశిఖరాలకు చేరుకోవాలి

**-బిజెపి యువనాయకురాలు చంటి దేవికప్రభు**


రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థినులను సన్మానిస్తున్న దృశ్యం

**చౌటకూరు, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
విద్యార్థులు ఉన్నతశిఖరాలకు చేరుకునేందుకు చదువుతోపాటు క్రీడల్లో రాణించాల్సిన అవసరం ఉందని బిజెపి యువనాయకురాలు చంటి దేవికప్రభు అన్నారు. మండలకేంద్రమైన చౌటకూరులోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థినులు నారాయణఖేడ్ పట్టణంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్‌క్రీడల్లో విజేతలుగానిలిచి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. అంగర్17 విభాగంలో ప్రథమస్థానం, అండర్14 విభాగంలో ద్వితీయస్థానాలను కైవసం చేసుకున్నారు. పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సభలో విజేతలను ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమానికి చంటి దేవికప్రభు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటి జిల్లాపేరును నిలపాలని క్రీడాకారులకు సూచించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు నగదు ప్రోత్సహకాలు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనురాధ, పిఆర్‌టియు టిఎస్ మండలాధ్యక్షులు మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్, రవీందర్, బిజెపి నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సార రాజ్‌కుమార్, ముకుందం, పుట్టి మోహన్, పల్లె ప్రభుకుమార్‌గౌడ్, దేవేందర్, సత్యనారాయణ, గాండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రంజోల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత


రంజోల్‌లో అక్రమనిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు

**జహీరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని రంజోల్ గ్రామంలోని జాతీయ రహదారిపై డైమండ్ హోటల్ పక్కలోని సర్వే నంబర్ 111లో అక్రమంగా నిర్మించిన షెడ్లను, ఇండ్లను సోమవారం మున్సిపల్ అధికారులు జేసిబి సహాయంతో పోలీసుల పహారా కాస్తుండగా కూల్చివేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు దేశ్‌ముఖ్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేస్తామని, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వైభవంగా పోచమ్మ విగ్రహప్రతిష్ఠాపన

**పెద్దశంకరంపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
మండలకేంద్రంలోని శ్రీముత్యాలపోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు సోమవారం నుండి వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలలో భాగంగా సోమవారం గోపూజ, వరుణయాత్ర, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాఃవచనం, నవగ్రహ, సర్వతోభద్ర మండల దేవతాపూజలు, హోమాన్ని నిర్వహించారు. మంగళవారం ధాన్యాదివాసం, చండీహోమం, బుధవారం యంత్ర విగ్రహప్రతిష్ఠ, పూర్ణాహుతి, అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## డబుల్ బెడ్‌రూమ్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

**-మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి**


కాలనీవాసులతో మాట్లాడుతున్న తుమ్మల పాండురంగారెడ్డి

**అమీన్‌పూర్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. సోమవారం అమీన్‌పూర్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో ఏర్పాటుచేసిన సమావేశానికి మాజీచైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రధానంగా మంచినీరు, నిరంతర విద్యుత్, పాఠశాల, అంగన్‌వాడీ తదితర సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. త్వరలో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా తన దృష్టికి తీసుకొని రావాలని కోరారు. ఈసమావేశంలో మాజీ కౌన్సిలర్ కల్పన ఉపేందర్‌రెడ్డి, మల్లేష్, కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## నేడు రంగంపేటలో రైతునేస్తం

**కొల్చారం, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
నేడు ఉదయం 10 గంటలకు రంగంపేట రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో రైతులకు వచ్చే యాసంగి పంటలో పప్పుధాన్యాలు, నూనెగింజల పంటల యాజమాన్యం, పత్తి, మొక్కజొన్న పంటల కొనుగోలు, పాటించవలసిన ప్రమాణాలు ఎన్‌ఎంఓఈ పథకంద్వారా వేరుశనగ విత్తనాలపంపిణీ, శాస్త్రవేత్తలచే దృశ్య, శ్రవణ మాధ్యమంద్వారా రైతుల సందేహాలకు ముఖాముఖి వుంటుందని ఆసక్తిగల రైతులు పాల్గొనాలని రంగంపేట క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారి కోరారు.

## మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు భూమి ఇవ్వండి

**-అంబేద్కర్ సంఘం నాయకులు**



తహసీల్దార్ మాలతికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
మహనీయుల విగ్రహాలను నెలకోల్పేందుకు స్థలం ఇవ్వాలంటూ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు ముత్తిగల రామచంద్రం ఆధ్వర్యంలో తహసీల్దార్ మాలతికి సోమవారం వినతిపత్రం అందించారు. పట్టణంలో సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 345లో 5 గుంటల భూమిని బాబు జగ్జీవన్‌రాం విగ్రహనిర్మాణానికి స్థలం ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి మండలాధ్యక్షుడు పోగుల రాజు, దుర్గపతి, మురళి, సంజీవ్, సత్తయ్య, జనార్ధన్, సిద్దిరాములు, యాదగిరి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

**-ప్రభుత్వభూములను ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలి**
**-పెద్దలు ఆక్రమిస్తే వదిలేస్తారు... పేదలు వేసుకుంటే కేసులా?**
**-సిపిఎం నాయకులు నాయిని నరసింహారెడ్డి**


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**అమీన్‌పూర్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కేసులు నమోదుచేయాలని, ఇల్లులేని పేదలకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాల ఆధారంగా ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని, సిపిఎం సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి పట్టాదారులతో కలిసి తహసీల్దార్ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వభూములను రాజకీయనాయకుల అండదండలతో ఆక్రమించి వెంచర్లుచేసి అమ్ముకుంటే చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు పట్టాసర్టిఫికెట్లు ఉన్న పేదలు ఇల్లు నిర్మిస్తే కేసులు పెడుతున్నారని విమర్శించారు. సుల్తాన్‌పూర్‌లోని 381 సర్వేనెంబర్‌లో గత పాలకులు ఇల్లులేని పేదలకు 100 గజాల స్థలం ఇవ్వడం జరిగింది అని తెలిపారు. ఆస్థలంలో అనేక సంవత్సరాలుగా గుడిసెలు, రేకులు వేసుకొని ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా ఆ రేకుల ఇళ్లను కూల్చివేసి పేదలపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. కానీ అదే సర్వేనెంబర్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొంతమంది పెద్దలు కబ్జాలుచేసి దర్జాగా నిర్మాణాలు చేస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను కాపాడాలనీ, కబ్జాదారులపై కేసులుపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జిలాని, సుల్తాన్‌పూర్‌వాసులు యాదయ్య, ఆంజనేయులు, కిష్టయ్య, అరుణ, జ్యోతి, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి సిఎంఆర్ఎఫ్ పథకం భరోసా

**-ఎమ్మెల్యే సునీతారెడ్డి**

**నర్సాపూర్, అక్టోబరు 13, ప్రభాతవార్త:**
పేదల ఆరోగ్యానికి సిఎంఆర్ఎఫ్ పథకం భరోసానిస్తుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ మాదాపూర్‌లోని ఆమె నివాసంలో లబ్దిదారుల కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా రూ.1,80,000 ఎల్వోసీపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.